ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 11-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో 2047 నాటికి 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు.
- కేంద్ర ప్రభుత్వ పథకాల సహకారంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి జరుగుతోందని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.
- వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు కావాల్సిన అన్ని రకాల ధృవపత్రాలు పొందేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- గిరిజన హక్కులను కాపాడతామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
- రాష్ట్రంలో పొడి వాతావరణం కారణంగా ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

==================

రాష్ట్రంలో 2047 నాటికి 15 శాతం వృద్ధిరేటు సాధించాలన్న లక్ష్యంతో ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో ఈరోజు ఉన్నతస్థాయి సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ విధానాలను సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 కోసం 10 ప్రధాన సూత్రాలతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ క్రమంలో ప్రతి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని ఇల్లు, గ్యాస్, మరుగుదొడ్లు, ఇంటిపై సౌర విద్యుత్, నీటి సదుపాయాలు కల్పించాలని కోరారు. ఫైళ్ళ పరిష్కారంలో అధికారులు వేగం పెంచాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్..30 సెకన్లు)

==================

కేంద్ర ప్రభుత్వ పథకాలైన ప్రసాద్, స్వదేశీ దర్శన్ 2.0, శాస్కి ల సహకారంతో రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి జరుగుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కేంద్ర పర్యాటక శాఖా మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈరోజు ఢిల్లీ నుండి దృశ్య మాధ్యమం ద్వారా నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ, విశాఖ జిల్లా సింహాచలం ఆలయ అభివృద్ధి పనులు 60 శాతం పూర్తయ్యాయని కేంద్ర మంత్రికి తెలిపారు. స్వదేశీ దర్శన్ 2.0 క్రింద బొర్రా గుహలు-లంబసింగి ప్రాజెక్టులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. అఖండ గోదావరి ప్రాజెక్టు అభివృద్ధి ప్రక్రియ ప్రస్తుతం టెండర్ దశలో ఉందని తెలిపారు. స్వదేశీ దర్శన్ క్రింద అభివృద్ధి చేయదలచిన నాగార్జున సాగర్, అహోబిలం, సూర్యలంక ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్ లను, మంగళగిరి, అరసవెల్లి దేవాలయాల ప్రతిపాదనలను త్వరతితగతిన ఆమోదించాలని కేంద్ర మంత్రికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

==================

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు కావాల్సిన అన్ని రకాల ధృవపత్రాలు పొందేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ తెలిపారు. అమరావతిలో ఈరోజు జరిగిన ఒక సదస్సులో ఆయన మాట్లాడుతూ, వాట్సాప్ గవర్నెన్స్ కి సంబంధించి ఆయా శాఖలన్నీ తమ డేటాను ఆర్టీజీఎస్‌లోని డేటా లేక్‌కు అనుసంధానం చేయాలని కోరారు. వాట్సాప్ ద్వారా సర్టిఫికెట్లు జారీ చేసే విషయంలో పరిశీలన ఒక కీలక ప్రక్రియ అన్నారు. అధికారులు తమ శాఖల్లో ఈ దిశగా సాంకేతికపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో డిజిటల్ రేషన్ కార్డులు అందజేస్తామని, తద్వారా కార్డుదారులకు క్యూ ఆర్ కోడ్ తోసే రేషన్ పొందే సదుపాయం లభిస్తుందని మంత్రి తెలిపారు.

==================

గిరిజన హక్కులను పరిరక్షించే 1/70 చట్టాన్ని తొలగించే ఉద్దేశ్యం లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గిరిజన జాతుల అస్థిత్వాన్ని కాపాడుకోవడం అంటే భారతీయ సంస్కృతిని కాపాడుకోవడమేనని సామాజిక మాధ్యమం ద్వారా పేర్కొన్నారు. గిరిజనుల విద్య, వైద్యం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని గుర్తు చేశారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు అందించామని తెలిపారు. కాగా, గిరిజనుల ప్రయోజనాలను కాపాడే 1/70 చట్టంపై ఎటువంటి సవరణలు చేయవద్దని కోరుతూ.. ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈరోజు చేపట్టిన బంద్ ప్రశాంతంగా జరిగింది.

==================

క్రీడల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుక్ మాండవీయాను అమలాపురం పార్లమెంటు సభ్యులు, పార్లమెంటరీ స్పోర్ట్స్ మెంటర్ జి.ఎమ్.హరీష్ బాలయోగి, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు కోరారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో కేంద్రమంత్రిని ఈరోజు వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడల అభివృద్ధికి సంబంధించి వినతిపత్రం అందజేశారు. అనంతరం హరీష్ బాలయోగి పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయనగరంలో గిరిజన క్రీడా పాఠశాల ఏర్పాటు చేసేందుకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్ధతిలో ఖేలో ఇండియా ద్వారా నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉన్న యూత్ హాస్టల్స్ శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారాయన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ యూత్ హాస్టల్స్ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, దానికి సంబంధించి నెహ్రూ యువజన కేంద్రానికి(ఎన్‌వైకె)కు సూచనలివ్వాలని కోరారు.

==================

విరామం

==================

పిల్లల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. పుట్టపర్తిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మహిళాభివృద్ధి సంక్షేమ సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాలల సంక్షేమం రక్షణ కమిటీ సమావేశం ఈరోజు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పిల్లల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. బాలల సంక్షేమం రక్షణ అందించడంలో ప్రతి శాఖ కలిసి పని చేయాలని కలెక్టర్ కోరారు.

==================

అటవీ మార్గం ద్వారా శ్రీశైల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలిగించవద్దని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో రహదారుల మరమ్మతులకు అటవీ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగిన సమావేశంలో ఆయన

మాట్లాడుతూ, శైవ క్షేత్రాలు ఎక్కువగా అటవీ ప్రాంత పరిధిలోనే ఉన్నాయని పేర్కొన్నారు. అటవీ మార్గం ద్వారా ఆయా దేవాలయాలకు వెళ్లే భక్తులకు సహకరించాలని స్పష్టం చేశారు. అదే విధంగా కాలుష్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చి దిద్దేందుకు తగిన స్థాయిలో పచ్చదనాన్ని పెంచాలని అటవీ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

===================

రాష్ట్రంలో పొడి వాతావరణంతో ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయని అమరావతిలోని భారత వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రోజుల్లో రెండు నుండి మూడు డిగ్రీలు ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్..31 సెకన్లు)

===================

రాష్ట్రంలో మామిడి పంటకు మంచు తాకిడితో ఇబ్బంది కలుగుతోంది. గత కొద్దిరోజులుగా దట్టంగా కురుస్తున్న మంచుతో పూత మాడిపోతోంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా మామిడి తోటలు ఉన్నాయి. వేల సంఖ్యలో రైతులు వీటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలో 22,467 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. తెల్లవారుజాము నుంచి అధికంగా కురుస్తున్న మంచుతో పాటు పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో మామిడి పూతను తామర పురుగు ఆశిస్తోంది. దీంతోపాటు తెగులు సోకి మామిడి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వీటి నివారణకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన క్రిమిసంహారక మందులను తగుప్రమాణంలో తెగులు సోకిన మామిడి పూతపై పిచికారీ చేయాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచించారు.

===================

పార్వతీపురం మన్యం జిల్లా, సీతానగరం మండలం లచ్చయ్యపేట గ్రామంలో జరుగుతున్న రీసర్వే కార్యక్రమాన్ని సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక ఈరోజు ఆకస్మిక తనిఖీ చేశారు. రీసర్వే చేపడుతున్న ప్రక్రియను సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీసర్వేతో ప్రజలకు, రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లరాదని తహసీల్దార్, సర్వే అధికారులను ఆదేశించారు. అనంతరం రైతులతో మాట్లాడి రీసర్వే జరుగుతున్న తీరు పట్ల వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

===================

పదవ తరగతి పరీక్షలను సమర్ధవంతంగా నిర్వహించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్ నుండి దృశ్య మాధ్యమం ద్వారా ఈరోజు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగే పదవ తరగతి పరీక్షలను సజావుగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలని ఈ సందర్భంగా కోరారు. జిల్లాలో 110 పరీక్షా కేంద్రాలలో 19217 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని కలెక్టర్ తెలిపారు.

===================
===================